



ఉల్లికి గిట్టుబాటు ధర గురించి ప్రశ్నిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర

అన్నదాతలను ఆదుకోండి

- యూరియా దొరక్క ఇబ్బందులు
- ఉల్లికి ధరలేక రైతుల ఆవేదన
- జడ్పీ మీటింగ్‌లో సభ్యుల చర్చ
- ఎరువుల కొరతలేదన్న కలెక్టర్

కడప రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కొరతతో అల్లాడుతున్నారని, కొతకొచ్చిన ఉల్లిపంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని పలువురు జడ్పీటీసీ సభ్యులు పేర్కొన్నారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఇటీవల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపొందిన మారెడ్డి లతారెడ్డి (పులివెందుల), అడ్డలూరు ముద్దుక్రిష్ణారెడ్డి(ఒంటిమిట్ట) జడ్పీటీసీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అజెండాను ప్రాంభించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయం, ఉద్యానశాఖ, మార్కెటింగ్, విద్యుత్, డీఆర్డీయే, సాగునీరు, రహదారులు, డ్వామా తదిర శాఖలపై కాస్త సాదాసీదాగా.. మరి కాస్త వాడీవేడిగా చర్చించారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్‌పై టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో రబీ సీజన్ ప్రారంభం కాబోతుందని ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసి రైతులకు అవసరమైన సదుపాయాలను సకాలంలో అందించాలన్నారు. వైసీపీ పాలనలో డీసీఎంఎస్ నిర్వీర్యం అయిందని చైర్మన్ జయప్రకాశ్ నారాయణబాబు ఆరోపించారు.



జడ్పీ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్‌చెరుకూరి, చిత్రంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, సీఈవో ఓబులమ్మ



జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు



పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మారెడ్డి లతారెడ్డి, అడ్డలూరి ముద్దుకృష్ణారెడ్డి

అర్హులందరికీ పింఛన్లు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అర్హులందరికి పింఛన్లు అందిస్తామన్నారు. వైసీపీ పాలనలో అర్హతలేని వారు కూడా వికలాంగుల పింఛన్లు పొందారన్నారు. దీని వలన నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం సరఫరా చేస్తోందని, దానిని బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా అరికట్టి రైతులకు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఉల్లి రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా అదుకుంటుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, వరదరాజులరెడ్డి

జీబ్రాలైన్స్ ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారిలోని అప్రోచ్‌రోడ్ల వద్ద ప్రమాదాలు జరగకుండా జీబ్రా లైన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ అనర్హులైన వికలాంగుల పింఛన్లను తొలగించడానికి తాము వ్యతిరేకం కాదని ఈ విధానంలో అర్హులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

ఉల్లిరైతులను ఆదుకోండి

కమలాపురం జడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర మాట్లాడుతూ ఉల్లిరైతులను ఆదుకోవాలన్నారు. దిగుబడులను ప్రభుత్వమే గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయాలన్నారు. వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ చీనీ నిమ్మ ఉల్లి రైతులకు గిట్టుబాటు ధరలేక నష్టపోతున్నారన్నారు. చక్రాయపేట జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 2000 ఎకరాల వరకు వరి సాగుచేశారని యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నారని, ఏడీఏకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్, పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా తదితరులు సమస్యలపై ప్రశ్నించారు.

యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. జిల్లాలో 1,60,000ల బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని అలా కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో 36,000 వరకు వికలాంగుల పింఛన్లు ఉన్నాయని ఇందులో 8,283 వరకు బోగస్‌వని గుర్తించామన్నారు. వీరందరికి రీ-వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించామని, అంతవరకు పింఛన్ పంపిణీ చేస్తారన్నారు. బోగస్ పింఛన్లకు సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపైన, ప్రోత్సహించిన వారిపైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఉల్లిపంట చేతికి రావడానికి 20 రోజుల సమయం పడుతుందని ఈ లోగా ఉల్లి రైతులను ఆదుకోవడానికి అన్ని రకాల చర్యలు చేపడతామన్నారు. జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి మాట్లాడుతూ యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా అరికట్టి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రైవేట్ డీలర్ల దోపిడీని నివారించాలన్నారు.



పోరుమామిళ్ల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్ధనారీశ్వరుడిగా పూజలందుకుంటున్న వినాయకుడు

వినూత్నంగా విఘ్ననాయకుడు



చవితి సంబరాలు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వినాయకుడు బుధవారం మండపాల్లో కొలువుదీరాడు. శుక్రవారం కొన్నిచోట్ల నిమజ్జనం పూర్తి చేశారు. చాలాచోట్ల ఆదివారం నిమజ్జనం చేయనున్నారు. మండపాల్లో వినూత్న రూపాల్లో కొలువుదీరిన గణపయ్య భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నాడు.

ప్రొద్దుటూరు వైఎంఆర్‌కాలనీ అరవింద ఆశ్రమంలో సూర్యప్రభ వాహనంలో గణనాథుడు

14 బార్లకు లాటరీ ద్వారా ఎంపిక



లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 14 బార్లకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి లాటరీ ద్వారా ఎంపిక చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లాలో ఓపెన్ క్యాటగిరీ కింద నోటిఫై చేసిన 27 బార్లలో 12 వాటికి, గీత కులాలకు 2 బార్లకు కలెక్టర్ సమక్షంలో లక్కీడిప్ ద్వారా ఎంపికలు జరిగాయి. ఈ బార్లకు దరఖాస్తుల ఫీజు రూపంలో రూ.12 కోట్లు, ప్రాసెసింగ్ ఫీజు రూపంలో రూ.6.10 లక్షలు, మొదటి విడత లైసెన్స్ ఫీజు కింద రూ.1.91 కోట్లు ప్రభుత్వ ఖాతాకు జమ అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

రేపు జిల్లాకు పీసీసీ అధ్యక్షురాలు
వైఎస్ షర్మిల రాక

కడప (కలెక్టరేట్), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సెప్టెంబరు 1వ తేదీ జిల్లాకు రానున్నారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి సమాచారం అందినట్లు డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్ షర్మిల 1వ తేదీ సోమవారం మధ్యాహ్నం 12-35 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కడపలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉంటారు. సాయంత్రం 5 గంటలకు కడప నుంచి ఇడుపులపాయకు బయలుదేరి వెళతారు. రాత్రికి వైఎస్సార్ ఎస్టేట్‌లో బసచేస్తారు. 2వ తేదీ ఉదయం 8-30 గంటల నుంచి 9-30 గంటల మధ్యలో వైఎస్సార్ ఘాట్‌కు వెళ్లి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ ఘాట్‌లో వైఎస్‌కు నివాళులర్పిస్తారు.

బ్యాక్‌వాటర్‌తో దారి బంద్

- పది గ్రామాల ప్రజల రాకపోకలకు ఇక్కట్లు



బొందలదిన్నె- సంకేపల్లె దారిపై చేరిన గండికోట బ్యాక్‌వాటర్

కొండాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గండికోట బ్యాక్‌వాటర్ చేరడంతో బొందలదిన్నె- సంకేపల్లె మధ్య దారి బంద్ అయింది. దీంతో పెన్నానది ఆవలివైపు ఉన్న పది గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడనుంది. గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం 21.227 టీఎంసీలకు చేరుకోవడంతో గురువారం నుంచి ఈ దారిలో బ్యాక్‌వాటర్ వచ్చి చేరింది. దీంతో సంకేపల్లె, టి.కోడూరు, కొత్తపల్లె, మరుగంపల్లె, దొబ్బుడుపల్లె, రాగికుంట, తిరుమలాయపల్లె, సిరిగేపల్లె, చామలూరు, ఎర్రగుడి గ్రామాల ప్రజల రాకపోలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడనుంది. ఈ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే అనంతపురం జిల్లా వంగనూరు నుంచి గాని, తాడిపత్రి నుంచి గాని తమ గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. బొందలదిన్నె నుంచి సుమారు 40 కి.మీ తాడిపత్రి నుంచి చుట్టిరావాల్సి వస్తోందని ఈ గ్రామాల ప్రజలు అందోళన చెందుతున్నారు. ఈ కష్టాలు తీరడానికి ఈ దారిపై రూ.62 కోట్లతో వంతెన పనులను ఐదునెలల కిందట ప్రారంభించారు. బ్యాక్‌వాటర్ వచ్చి చేరడంతో వంతెన పనులకు అంతరాయం ఏర్పడనుంది. నాలుగేళ్లుగా గండికోట బ్యాక్‌వాటర్ పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు ఈ పది గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కట్లను తీర్చడానికి కూటమి ప్రభుత్వం బ్రిడ్జి పనులను ప్రారంభించిందని వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని చామలూరు సర్పంచ్ రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

సమాధుల స్థలం కోసం రిజర్వేషన్



కడప రిమ్స్ సమీపంలోని క్రైస్తవ సమాధుల తోట (శ్మశానం)లో ఏర్పాటుచేసిన రిజర్వు బోర్డులు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సమాధులకోసం రిజర్వేషన్ చేసుకోవడం కొన్నిచోట్ల ఉంది. తనను భర్త సమాధి పక్కనే అంత్యక్రియలు చేసుకునేందుకు వీలుగా ముందస్తుగా భార్య స్థలం కొనుగోలు చేస్తుంటారు. అలాగే భార్య సమాధి పక్కన తన అంత్యక్రియలకోసం భర్త కూడా స్థలం కొనుగోలు చేస్తుంటారు. కాగా కొన్ని క్రైస్తవ శ్మశాన వాటికల్లో స్థలం లేకపోవడం కారణంగా భార్య సమాధిపైనే భర్తను సమాధి చేయడం.. అలాగే భర్త సమాధిపైన భార్యను సమాధి చేస్తుంటారు. ఈ ఆనవాయితీ క్రైస్తవ సమాజంలో అరుదుగా కనిపిస్తుంటుంది.

మరణానంతరం మట్టిలో కలిసినా పక్కనే ఉండాలని ఇలా చేస్తుంటారు. కడప రిమ్స్ సమీపంలో క్రైస్తవ సమాధుల తోట (శ్మశానం) ఉంది. ఇక్కడ భర్త సమాధి పక్కన భార్య, భార్య సమాధి పక్కన భర్త రిజర్వ్ చేసుకుని బోర్డులు కూడా పాతారు. బతికుండగానే చిన్న చిన్న విషయాలకే జంటలు విడిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి భావన ఇక్కడ కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. భార్యభర్తల బంధం ఎంతో పవిత్రమైందని, అది మరణానంతరం కూడా కొనసాగాలని వారు ఆకాంక్షిస్తూ అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అభినందనీయమని చెప్పాలి.

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి మల్లిక

7



కోతకోస్తే.. కన్నీరే

- ఉల్లిపంట చేతికొచ్చే దశలో పతనమైన ధర
- క్వింటా రూ.600
- నెలక్రితం వరకు రూ.1700 నుంచి రూ.2000
- ఆందోళన చెందుతున్న ఉల్లి రైతులు

తొండూరు మండలంలో సాగైన ఉల్లి పంట



ఉల్లి కోస్తే కన్నీరు వస్తుంది. కానీ ఉల్లి పండించే రైతు కంటా కన్నీరు వస్తోంది. నెల క్రితం వరకు క్వింటా ఉల్లి రూ.1700 నుంచి రూ.2000 పలికింది. రోజురోజుకు పతనమవుతూ నేటికి క్వింటా రూ.600కు పడిపోయింది. ఉల్లి సాగు చేయాలంటే ఎకరాకు దాదాపు లక్ష నుంచి రూ.1.50లక్షలు ఖర్చు అవుతుంది. క్వింటా రూ.600 అంటే కనీసం కూలీలక ఖర్చు కూడా రాదని రైతులు వాపోతున్నారు. పంట పొలాల్లోనే వదిలేయాలో పంటను తీయాలో అంతుబట్టడం లేదని అంటున్నారు.

పులివెందుల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది దాదాపు ఆరువేల ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశారు. ముఖ్యంగా వీరపు నాయునిపల్లె మండలం లో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు. ఇక్కడ 2,257 ఎకరాల్లో పంట సాగైందని అధికారిక లెక్క. ఇక వేంపల్లె మండలంలో 361 ఎకరాల్లో, వేముల మండలంలో 634, తొండూరు మండలంలో 284, ఎర్రగుంట్ల మండలంలో 193, పులివెందుల మండలంలో 116, పెండ్లిమర్రి మండలంలో 440, ముద్దనూరులో 110 ఎకరాల్లో, మైదుకూరు మండలంలో 383, దువ్వూరు మండలంలో 431 ఎకరాల్లో ఉల్లి పంట సాగైంది. మరో 12 మండలాల్లో 10 ఎకరాల నుంచి వంద ఎకరాల్లోపు సాగు చేశారని అధికారుల అంచనా.

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధర మరీ దయనీయ పరిస్థితిలో ఉంది. గత ఏడాది జూలై మాసానికి కోతకు వచ్చిన ఉల్లిపంటకు క్వింటా రూ.2,500 నుంచి రూ.3వేల వరకు పలికింది. ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో వర్షాల కారణంగా రూ.1500 నుంచి రూ.2వేలకు చేరింది. అయితే ఈ ఏడాది ఉల్లి ధర దయనీయంగా ఉంది. ప్రస్తుతం క్వింటా కేవలం రూ.600 మాత్రమే.

ఆవేదనలో ఉల్లి రైతులు

ఒక ఎకరం ఉల్లి సాగుచేస్తే పంటకు చీడపీడలు లేకుండా ఉంటే 80 నుంచి 100క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఒక ఎకరాలో ఉల్లి సాగు చేయాలంటే అన్ని ఖర్చులు కలిపి దాదాపు రూ.1.50 లక్షలు అవుతుంది. సాగు ఖర్చు రావాలంటూ క్వింటా కనీసం రూ.1500 ఉండాలి. క్వింటా రూ.600 అంటే పొలాల్లోనే వదిలేయడం మంచిదని రైతులు అంటున్నారు. ఉల్లిపంటను మార్కెట్‌కు తరలించాలంటే భూమి నుంచి వాటిని తీసి ఉల్లిపొట్టు తొలగించి ఉల్లికొవ్వులు కోయాలి. దీనికి కూలీల ఖర్చు ఎక్కువ అవుతుంది. ధర బాగా తక్కువగా ఉండటంతో ఇంత ఖర్చుచేసి పంట కోయడం కంటే పొలాల్లోనే వదిలేయడం మంచిదని రైతులు వాపోతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఉల్లి రైతులు కోరుతున్నారు.

పొలాల్లోనే వదిలేయడం మంచిది

ఐదెకరాల్లో ఉల్లి సాగుచేశాను. ప్రస్తుతం కోతకు వచ్చింది. ఈ పంట భూమి నుంచి తీసి మార్కెట్‌కు తరలించాల్సిందే. నిల్వ చేయడానికి ఏమాత్రం అవకాశం లేదు. అంటే మార్కెట్‌లో ఏ ధర ఉంటే ఆ ధరకు అమ్మాల్సిందే. క్వింటా రూ.600 అంటున్నారు. ఈ ధర ఉంటే పంటను పొలాల్లోనే వదిలేయడం మంచిది.

- గోపాల్, ఉల్లిరైతు, గంగాదేవిపల్లె, తొండూరు మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి

మూడెకరాల్లో ఉల్లి సాగుచేశాను. ప్రస్తుతం కోతకు వచ్చింది. అనుకున్న మేర దిగుబడి వస్తుంది. కానీ ధరచూస్తే కన్నీరు వస్తోంది. 20 రోజుల క్రితం వరకు క్వింటా రూ.2వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.600 పలుకుతోంది. ఈ ధర అయితే రైతు పూర్తిగా నష్టపోతారు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

- గంగయ్య, గంగాదేవిపల్లె, తొండూరు మండలం

టపాసుల దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలకు కొత్త లైసెన్స్‌లకు, రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం ఎల్ఈ-5 కోసం, ఫారం ఏఈ-5 లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత సంవత్సరంలో ఫారం ఎల్ఈ-5 లైసెన్స్ పొందిన వారు తదుపరి రెన్యువల్ కోసం ఫారం ఆర్ఈ-1తో పాటు సీఎఫ్ఎంఎస్‌లో చలానా చెల్లించి సెప్టెంబరు 20వ తేదీలోగా వారి పరిధిలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని తెలిపారు. డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు సూచించిన ప్రదేశంలోనే టపాకాయల దుకాణాలు పెట్టుకోవాల్సి ఉంటుందని, వేరే స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

అన్నమయ్య జిల్లా సాధనకు నేడు అఖిలపక్ష సమావేశం



మాట్లాడుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

రాయచోటిటౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సాధనకు ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద వారు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాయచోటిని జిల్లా కేంద్రంగానే ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనే నినాదంతో పట్టణంలోని అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ఈ సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు హాజరై వారి అభిప్రాయాలను తెలపాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఈశ్వర్, ఎమ్మార్పీఎస్ రామాంజనేయులు, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు, భారతీయ అంబేడ్కర్ సేన పల్లం తాతయ్య, రజక సంఘం రమేశ్‌బాబు, వీరబల్లి శ్రీనివాసులు, లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు విశ్వనాథరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్ఐవో వెంకటేశ్వర్లు

చక్రాయపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియట్ ఆర్ఐవో వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం చక్రాయపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రంతు బాషాతో కలిసి తరగతి గదులు, వంటశాలను పరిశీలించారు. అలాగే వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తర్వాత గండి క్షేత్రం వీరాంజనేయ స్వామిని దర్శించుకొన్నారు. కార్యక్రమంలో గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, చక్రాయపేట ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించాలి

- జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ప్రయోగశాలతో విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం యర్రగుంట్ల సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని అటల్ టింకరింగ్ ప్రయోగశాలను ఆయన సందర్శించారు. ప్రయోగశాల పనితీరును, విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను, రికార్డులను పరిశీలించారు. నేషనల్ ఇన్నోవేషన్ మిషన్ కింద కేటాయించిన నిధుల వినియోగంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకొని 3డీ ప్రింటింగ్ మిషన్‌ను ఉపయోగించి మోడల్స్ రూపొందించారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో విద్యార్థులకు కోడింగ్ నైపుణ్యాలను పెంపొందింపజేయాలన్నారు. అటల్ క్యాలెండర్‌ను అనుసరించి ప్రతి వారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రతి నెల అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పనితీరును సమీక్షించి లీవ్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సైన్స్ అధికారి

ఒకే దెబ్బకు.. 93 అర్జీలకు మోక్షం



- సీఎంవో నుంచి ఆర్టీవోకు ఫోన్
- అప్రమత్తమైన అధికారులు
- గంటల్లో సమస్య పరిష్కారం
- దివ్యాంగుడు సాయిశరత్‌తో పాటు..
- ఇతరుల అర్జీలకూ ఆమోదం

మదనపల్లె, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మంగా చేపడుతోంది. అయితే ఆయా శాఖల అధికారులు పరిష్కారం అయ్యే వాటిని సకాలంలో క్లియర్ చేయాల్సి ఉన్నా ఆసక్తి చూపడంలేదు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలకు అడ్డుగా ఉంటున్న (అనర్హులుగా) ఆరు పాయింట్లపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను ఆయా శాఖలకు పంపుతున్నారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు క్లియర్ చేయకపోవడంతో ప్రజలు నిత్యం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే..జీఎస్‌డబ్ల్యూఎస్ పోర్టల్‌లో ప్రభుత్వం వాటిని తొలగించాల్సి ఉందని చెప్పి పంపుతున్నారు. మరోవైపు ఆయా శాఖల నుంచి డేటాను జీఎస్‌డబ్ల్యూఎస్ పోర్టల్‌తో అనుసంధానం చేయాల్సి ఉందని మరికొందరు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ఈ ప్రక్రియ సొంతం ప్రభుత్వస్థాయిలో విజయవాడలో జరగాల్సి ఉందని, తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఇలా ప్రభుత్వ పథకాలకు ప్రధాన అడ్డంకిగా పరిణమిస్తున్నాయి. ఇలా ఆరుశాఖల నుంచి ఎదురయ్యే సమస్యలపై అటు సచివాలయ ఉద్యోగులు, అటు ఆయా శాఖల అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన లేమితో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. ఇలాంటి సమస్యనే ఆరు నెలలుగా ఎదుర్కొంటున్న దివ్యాంగుడు చివరకు సీఎం కార్యాలయాన్ని ఆశ్రయించాడు. అంతే ఒకే దెబ్బకు 93 అర్జీలు క్లియర్ అయ్యాయి. దీంతో సమస్య ఎక్కడో లేదని, ఇక్కడే ఉందని అర్థం అవుతోంది.

మదనపల్లె మండలం కొత్తయిండ్లు పంచాయతీ తాళ్లసుబ్బన్న కాలనీకి చెందిన రాటకొండ వెంకటరమణనాయుడు కుమారుడు రాటకొండ సాయిశరత్‌కు 2011 నుంచి వికలాంగుల పింఛన్ వస్తుండగా, అప్పటి వైసీపీ ప్రభుత్వం 2022లో నాలుగు చక్రాల వాహనం ఉందని పింఛన్‌ను రద్దు చేసింది. తర్వాత ఆ కారును ఇతరులకు అమ్మేశారు. ఆర్టీవో కార్యాలయంలో కూడా కారు ఇతరుల పేరుపైన మార్పిడి అయింది. తర్వాత అప్పటి నుంచి జీవనాధారమైన పింఛన్‌ను పునరుద్ధరించాలని అటు మంత్రి నారా లోకేశ్, ఇటు సీఎం చంద్రబాబునాయుడును కలసి వినతిపత్రం అందజేశాడు. వెంటనే చర్యలు చేపట్టాలని సీఎంవో కార్యాలయం నుంచి సంబంధిత అధికారులకు ఆదేశాలు అందినా పనికాలేదు. తిరిగి మండల పరిషత్తు, సచివాయాన్ని సంప్రదిస్తే నాలుగు చక్రాల వాహనం ఉందంటూ చెప్పి పంపుతున్నారు. వాహనం లేదని స్థానిక ఆర్టీవో ఇచ్చిన ధ్రువీకరణ పత్రం చూపించినా..తమకు సంబంధం లేదని ఆన్‌లైన్‌లో చూపిస్తోందని చెబుతున్నారు. ఈ క్రమంలో సమస్యను ఎంతమంది అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరి నుంచీ కూడా సరైన సమాధానం లేదు. దీనిపై బాధితుడు పడుతున్న ఇబ్బందిని వివరిస్తూ, 'పింఛన్‌కోసం దివ్యాంగుడి పోరాటం' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన సీవోఎం కార్యాలయంలో ఎన్ఆర్ఐ వింగ్‌లో పనిచేస్తున్న డి.వెంకటేశ్వర్‌రావు..మదనపల్లె ఆర్టీవోను శనివారం ఫోన్‌లో సంప్రదించారు. సమస్య ఎక్కడుందో తేల్చాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆర్టీవో శాఖ పోర్టల్ తోపాటు జీఎస్‌డబ్ల్యూఎస్, ఎంబీఎం పోర్టల్‌లో ఆరా తీశారు. విజయవాడ సీఎంవో కార్యాలయం కేంద్రంగా రాయచోటిలోని డీటీసీ కార్యాలయంతో పాటు గ్రామ సచివాలయ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో ఉంటూ సమస్యపై తీవ్రంగా శ్రమించారు. ఇలా మూడు విభాగాలు ఆన్‌లైన్‌లో సంప్రదిస్తూ రెండు గంటల అనంతరం సమస్యను పరిష్కరించారు. తాము పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న సమస్యను సాయిశరత్ లాగా ఎంత మంది సీఎంవోను ఆశ్రయించగలరు? సీఎంను కలసి ఇబ్బందిని చెప్పుకోగలరో అధికారులకే తెలియాలి. ఈ సమస్య కేవలం దివ్యాంగుడు సాయిశరత్‌కే కాదు.. కరెంటు బిల్లు 300 యూనిట్లకు మించి వాడుతున్నారని, నాలుగు చక్రాల వాహనం, ఆదాయపు పన్ను చెల్లింపు, అర్బన్ ప్రాపర్టీ, పది ఎకరాలకుపైన భూమి ఉందని, తదితర ఆరు పాయింట్ల వ్యాలిడేషన్‌తో అర్హులు.. ఆయా శాఖల నుంచి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో తల్లికి వందనం, రేషన్‌కార్డు, పింఛన్, తదితర పథకాల లబ్ధిదారులు ఉన్నారు. అయితే శనివారం నాటి ఘటనతో సాయిశరత్‌తో పాటు మరో 92 మంది బాధితులకు ఆన్‌లైన్‌లో 'అనర్హుల' నుంచి విముక్తి కలిగింది. దీంతో సీఎంవో కార్యాలయం అధికారి డి.వెంకటేశ్వర్‌రావుకు, టీడీపీ సీనియర్ నేత గంగారపు బాబురెడ్డికి బాధితుడు సాయిశరత్, ఆయన తండ్రి రాటకొండ వెంకటరమణనాయుడుకృతజ్ఞతలు తెలిపారు.

సురక్షిత తాగునీరు అందించిన తర్వాతే ఓట్లు అడుగుతా..

- రూ.2 వేల కోట్లతో గండికోట జలాశయం నుంచి పీలేరుకు నీళ్లు
- సూపర్ సిక్స్ పథకాల విజయోత్సవ సభలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి



విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

పీలేరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చివరి మారుమూల గ్రామానికి కూడా సురక్షిత తాగునీరు అందించిన తరువాతే మళ్లీ ఓటు అడుగుతానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో శనివారం సూపర్ సిక్స్ పథకాల విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీపై, తన కుటుంబంపై నమ్మకంతో మహిళలు తనను అత్యధిక మెజారిటీతో గెలిపించారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా కడప జిల్లా గండికోట జలాశయం నుంచి కేవలం పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.2వేల కోట్లు మంజూరు చేశారని, ఆ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలోనే ప్రారంభమయ్యే ఆ పనులు రెండేళ్లలో పూర్తయితాయన్నారు. ఝరికోన ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కానీ కూటమి ప్రభుత్వం రూ.66 లక్షలు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టిందన్నారు. దీంతో కేవీపల్లె, కలికిరి, కలకడ మండలాల ప్రజలకు ఝరికోన నీరు అందుబాటులోకి వచ్చిందన్నారు. కృష్ణా జలాలను కుప్పం నియోజకవర్గానికి తరలించిన స్ఫూర్తితోనే పీలేరు నియోజకవర్గంలోని పంట పొలాలకు కూడా నీరు అందిస్తామని, కేవీపల్లె మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ పూర్తి చేసేందుకు రూ.250 కోట్లు మంజూరు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించానని, త్వరలోనే ఆ నిధులు కూడా మంజూరవుతాయన్నారు. ఉపాధి హామీ నిధులతో నియోజకర్గమంతా సిమెంటు రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా మహిళల మీద గౌరవంతో ముఖ్యమంత్రి ఇప్పటికే తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీ, అన్నదాత సుఖీభవ, పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ హామీలను నెరవేర్చారని, ఆడబిడ్డ నిధి పథకం అమలు కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ మండలాల నాయకులు, ఏఎంసీ ఛైర్మన్లు, సింగిల్ విండో అధ్యక్షులు, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మహేష్

పీలేరు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను సమూలంగా అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అదనపు జడ్జి మహేష్ తెలిపారు. శనివారం మర్రిమాకల తండాలో షెడ్యూల్డ్ తెగల్లో బాల్య వివాహాలు అరికట్టడం అన్న అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు ఎన్ని తీసుకొచ్చినా పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోతే అనుకున్న ఫలితాలను సాధించలేమన్నారు. పూర్తిగా శారీరక ఎదుగుదల లేనిదే వివాహం చేయడం వల్ల పుట్టపోయే పిల్లలు మానసిక ఎదుగుదల లేకుండా అనారోగ్యంతో జీవించాల్సి వస్తుందని తెలిపారు. సంసార బాధలను తట్టుకొనే శక్తి ఉండకపోవడంతో జీవితం ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉంటుందని వివరించారు. తెలిసీతెలియని వయసులో ప్రేమ పెళ్లిళ్ల పేరిట యువతీయువకులు తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోరాదన్నారు. బాల్య వివాహాలతో భవిష్యత్‌లో ఉత్పన్నమయ్యే అనర్థాలపై చాలా మందికి అవగాహన లేదన్నారు. స్త్రీ శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమ శాఖ వారు బాల్య వివాహాలపై వాడవాడలా అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా గ్రామాల్లో బాల్య వివాహాలు అరికట్టవచ్చని తెలిపారు. అవకాశాలను సమయానుకూలంగా సద్వినియోగం చేసుకుని దేశం గర్వించదగ్గ విధంగా ఎదగాలని తెలిపారు. సమావేశంలో స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జి ఆర్.మురళి, ఎంపీడీవో శివశంకర్, ఎంఈవో పద్మావతి, డీటీ ప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, న్యాయవాది సౌకత్‌అలీ, సీడీపీవో రాజమ్మ, ఎస్ఐ ఎం.లోకేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



మర్రిమాకల తండా మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జడ్జి

ముగ్గురిపై కేసు నమోదు

కలకడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రకోట పల్లెగొల్ల పల్లెకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుధాకర్‌పై దాడి చేసిన ముగ్గురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పదవీవిరమణ పొందిన తరువాత సుధాకర్ పశుపోషణ చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన వెంకటరమణ పాడి ఆవులు సుధాకర్ పశువులపైకి వచ్చి ఇబ్బంది పెడుతుండడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో వెంకటరమణ అతని కుమారుడు ఆనంద్, మునీంద్ర బాధితుడిపై రాళ్లతో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టిని తవ్వి.. వెంచర్లకు తరలించి..

- గుర్రంకొండలో ఆగని మట్టి తవ్వకాలు
- కొండలు, గుట్టలను తవ్వేస్తున్నారు
- చోద్యం చూస్తున్న అధికారులు

గుర్రంకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రియల్ వ్యాపారులు కొండలు, గుట్టలను తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఈ మట్టి తరలింపుతో కొండలు, గుట్టలు తమ రూపురేఖలను కోల్పోతున్నాయి. అక్రమార్కులు గుట్టల వద్ద ఎక్స్‌కవేటర్లు పెట్టి ట్రాక్టర్లలో మట్టిని వెంచర్లకు తరలిస్తున్నారు. దీంతో ప్రతిరోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లలో మట్టిని తరలించి రియల్ వ్యాపారులు సొమ్ము చేసుకొంటున్నారు. ఈ మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులకు సమీప రైతులు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గుర్రంకొండ పంచాయతీ పరిధిలోని మద్దిరెడ్డిగారి పల్లె సమీపంలో రాశిచెరువు ఉంది. ఈ చెరువు పక్కనే పెద్ద ఎత్తులో మట్టి దిబ్బలున్నాయి. ఈ మట్టి దిబ్బలపై రియల్ వ్యాపారుల కన్నుపడింది. దీంతో ఎక్స్‌కవేటర్లు పెట్టి మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. గుర్రంకొండ పట్టణంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది.

మట్టి తవ్వకాలను నిలిపేస్తాం..

మద్దిరెడ్డిగారిపల్లె సమీపంలో మట్టి తవ్వకాలపై ఎటువంటి సమాచారం రాలేదు. గ్రామానికి వెళ్లి మట్టి తవ్వకాలను పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు, గుట్టల్లో మట్టిని తవ్వి తరలించే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. అక్రమంగా మట్టి తవ్వుతూ వాహనాలు కనబడితే సీజ్ చేస్తాం.

- సదాశివప్పనాయుడు, ఇన్‌చార్జి ఆర్ఐ



రాశిచెరువు వద్ద మట్టిని ట్రాక్టర్లకు నింపుతున్న ఎక్స్‌కవేటర్

భూ అక్రమణపై నోటీసులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కోళ్లబైలు గ్రామంలోని చిన్నరెడ్డెప్పకు చెందిన భూమి 2.88 సెంట్లు ఉందని వారసులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశా రు. విచారణ చేసి బుడ్డారెడ్డి కుమారుడు వెంకటరమణారెడ్డి పేరిట తప్పుడు పత్రా లు సృష్టించి అసైన్‌మెంట్ భూమిని రిజి స్టర్ చేశారని, వెంటనే కొరముట్ల మురళి, కొరముట్ల సూర్య శేఖర్ నోటీసులు అందజేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కలెక్టర్ ఆదేశాల మేరకు వెంకటరమణ తండ్రి మునెప్ప పేరిట భూమి ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

డీఏపీ కొంటేనే.. యూరియా

- అధిక ధరలతో విక్రయాలు
- యూరియా బస్తా రూ.350 నుంచి రూ.400
- రైతులను నట్టేటముంచుతున్న వ్యాపారులు

నిమ్మనపల్లి ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులను ఎరువు దాకాణాదారులు అధిక ధరలతో నట్టేట ముంచుతున్నారు. వర్షాభావం, పండించిన పంటకు ధర లేక ఓవైపు, నాశిరకం విత్తనాలతో మరోవైపు రైతులు నష్టాల ఊబిలో ఇరుక్కుంటుంటే.. ఇప్పుడు ఎరువుల దుకాణదారులు కూడా రైతులను ముంచేస్తున్నారు. యూరియా కావాలంటే దానికి అదనంగా డీఏపీ కొంటేనే ఇస్తామని కొర్రీలు పెడుతున్నారు. అంతేకాక బస్తా మీద రూ.70 నుంచి రూ.100వరకు అదనంగా రాబడుతూ రైతుల నడ్డి విరుస్తున్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫర్టిలైజర్స్‌లో యూరియా కొనేందుకు వందల సంఖ్యలో రైతులు రావడంతో యజమాని ఇష్టారాజ్యంగా అధిక ధరలకు అమ్ముతున్నాడు. ప్రస్తుతం వరి, వేరుశనగ ఇతర పంటలకు అదును కావడంతో ఒక్కో రైతు అధికంగా యూరియాను కొనుగోలు చేస్తున్నారు. దీన్ని అలుసుగా తీసుకొన్న దుకాణాదారుడు రెచ్చిపోయి అధిక ధరలకు ఎరువు విక్రయాలు చేస్తున్నాడు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. డీఏపీ బస్తా రూ.1500 లేదా రూ.400 విలుత చేసే బకెట్‌ను రూ.600వందలకు కొంటేను యూరియా అమ్ముతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి మంజులకు తెలియడంతో హుటాహుటిన ఫర్టిలైజర్ దుకాణం వద్దకు చేరుకొని స్టాకు రిజిష్టరు పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యూరియాను అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఇప్పటికే ఈ ఫర్టిలైజర్స్‌కు పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఫలితం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. అలాగే ప్రస్తుతం దుకాణంలో వున్న 8.4 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు.



ఫర్టిలైజర్ దుకాణంలో విచారణ చేపట్టిన ఏవో మంజుల

డీఏపీ కొంటేనే యూరియా..



డీఏపీ మూట కొంటేనే యూరియా మూట ఇస్తామని ఫర్టిలైజర్స్ దుకాణాదారుడు చెబుతున్నాడు. విధిలేక అవసరం లేకున్నా డీఏపీ కొని యూరియాను తీసుకెళుతున్నాం.

- రాజన్న, రైతు, బోయకొండ

బకెట్ కొనాల్సిందే..



ఒక్క మూట యూరియా కావాలన్నా ఈ ఎరువుల దుకాణంలో బకెట్ కొనాల్సిందే. ఇతర మండలాలకు చెందిన రైతులు కూడా నిమ్మనపల్లి వచ్చి అధిక రేటు వెచ్చించి తీసుకెళుతున్నారు.

- శంకర, రెడ్డివారిపల్లి

భూ వివాదం దాడిలో ముగ్గురికి గాయాలు

- కిడ్నాప్ చేసి హత్యాయత్నం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో కిడ్నాప్ చేసి కత్తి, కర్రలతో దాడి చేసిన సంఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున ముదివేడు దళితవాడకు చెందిన వెంకటరమణ కుమారుడు రామచంద్ర(40) వినాయక చవితి పండుగ సందర్భంగా తన అక్కకు చీర, పసుపు కుంకుమ ఇవ్వడానికి ములకలచెరువు మండలం బురకాయలకోటకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన భాస్కర్, గంగాద్రి, ఆదిలక్ష్మి, ప్రసాద్, శ్రీనా, భగవాన్‌తో పాటు మరికొందరు ఇంట్లో నిద్రిస్తున్న రామచంద్రకు మత్తు మందు ఇచ్చి మంచంతో పాటు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో, కర్రలతో గాయపరిచారు. గమనించిన మంచాల భరత్, హరికుమార్ అడ్డుకున్నారు. వీరిపై కూడా దాడి చేసి గాయపర్చారు. ముదివేడు కృష్ణారెడ్డిగారిపల్లెలో ఉన్న 9 ఎకరాల పొలం విషయంగా గత నెల 11న రెవెన్యూ అధికారులు, పోలీసులు సర్వే నిర్వహించి రామచంద్ర హక్కుదారుడుగా తేల్చారని, దీంతో కోపంగా ఉన్న దాయాదులు హత్య చేయడానికి ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బాధితులకు మద్దతుగా సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా నాయకులు తోపు కృష్ణప్ప, మురళి డిమాండు చేశారు.



దాడిలో గాయపడిన బాధితులు

చెరువులకు మహర్దశ..!

మరమ్మతులకు ప్రణాళికలు

రూ.73.08 కోట్ల అంచనాలకు ఆమోదం

100 చెరువులకు ప్రయోజనం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువులకు మహర్దశ పట్టనుంది. వీటితో పాటు కాల్వలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టుకు కూడా సాగునీరందించి జిల్లాను సస్య శ్యామలం చేసేందుకు నీటిపారుదల శాఖ అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. గత కొన్నేళ్లుగా నిర్వహణ లేకపోవ డం, మరమ్మతులుకు నోచుకోక పలు మైనర్ ఇరిగేషన్ చెరువులు అధికంగా పూడికతో నిండిపోయాయి. మట్టి కట్టలు బలహీనపడ్డాయి. మరో పక్క నీటిపారుదల కాల్వలు, తూములు తదితర అద నపు నీటి వనరుల సదుపాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.


ముద్దనూరు మండలం గంగాదేవి పల్లె చెరువు

మరమ్మతులకు ప్రణాళికలు

జిల్లాలో పలు చెరువుల్లో నీటి వనరుల మరమ్మతులుకు నీటిపారుదలశాఖ ఇంజనీరింగ్ అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రణాళికలపై ఇటీవల నిర్వహించిన ఆర్ఆర్ ఆర్ జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ ప్రత్యేక దృష్టి సారిం చింది. ఇందులో భాగంగా నీటి సంరక్షణ, నిర్వహణను మెరుగు పరచడం, సాంప్రదాయ నీటి వనరుల క్రియాత్మక సామర్థ్యాన్ని పునరుద్ధరించడం వంటి చర్యలతో పాటు సుస్థిరమైన వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు, చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించి జిల్లాను కరువు నిరోధక ప్రాంతంగా తీర్చాలనే అంశాలపై కలెక్టరు చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన కమిటీ సుదీర్ఘంగా చర్చించి.. అనేక అంశాలపై దిశ నిర్దేశనం చేసింది. 100 ట్యాంకులకు రిపేర్లు, రినోవేషన్, రిస్టోరేషన్, ఫేస్-3 కార్యక్రమం దశ-3 ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు డీఎల్ఐ, ఎంసీ కమిటీ ప్రతిపాదించింది. డీపీఏపీ, రైడ్ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని 100 ట్యాంకులకు బండ్, ఇన్‌వాయిస్‌లు, స్లూయిస్, సరఫరా ఛానెళ్లు, నీటిపారుదల ఛానెళ్ల మరమ్మతులు అవసరం అని గుర్తించారు. ఈ పనుల నిర్వహణ కోసం రూ.7308.49 లక్షలు ఖర్చు చేసేందుకు కలెక్టరు ఆమోదం తెలిపారు. కాగా ఈ పనులను కరువు పీడిత ప్రాంతం, మారుమూల అంతర్గత అభివృద్ధిలోని 24 మండలాలను కవర్ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఆర్ఆర్ఆర్ కార్యక్రమం దశ-3 కింద 100 వివరణాత్మక ప్రాజెక్టు నివేదికల తయారీ మరియు అమలు చేపట్టాలని ప్రతిపాదించారు.

మరమ్మతులకు నోచుకోనున్న చెరువులు ఇవే...

పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలంలో నారపురెడ్డికుంట, ఉప్పర్లకుంట, రేకలగుంట, మహదేవపల్లి, పెద్దచెరువుపల్లె, మాధవ పంతుల చెరువు, దాసిరెడ్డి చెరువు, చక్రాయపేట చెరువు, ఎర్రగుడిచెరువు, పెద్దరెడ్డి చెరువులు మరమ్మతుల జాబితాలో ఉన్నాయి.

● పులివెందుల మండలంలో అచ్చివెళ్లి, ఎర్రబెల్లి చెరువులు, సింహాద్రిపురం మండలంలో కసునూరు, అంకాలమ్మ గూడూరు, బలపనూరు, బానుగుట్ట చెరవులున్నాయి.

● తొండూరు మండలంలో మల్లేల చెరువు, తొండూరు, గంగన్న చెరువు దాసరి చెరువు, చెర్లోపల్లె చెరువు, పెద్ద చెరువు పాత చెరువు కొత్త చెరవు ఉన్నాయి.

● వేముల మండలంలో వేల్పుల చెరువు, రాకలవరిచెరువు, నల్లచెరువు, లోపలి చెరువు, నాయినిచెరువు, కొత్తపల్లె చెరువు మరమ్మతుల జాబితాలో ఉన్నాయి.

● లింగాల మండలంలో వెలిదండ్ల, లింగాల, ఇప్పటాల, బోనాల చెరువులు, వేంపల్లె మండలంలో నాగూరు చెరువు కూడా మరమ్మతుల జాబితాలో ఉంది.

త్వరలోనే టెండర్లు



జిల్లాలో చెరువుల మరమ్మతులకు సంబంధించి అంచనా వేయ డానికి జిల్లా కమిటీ ఆమోదం లభించింది. ఇక రాష్ట్ర కమిటీ, ఆ తర్వాత కేంద్ర కమిటీ ఆమోదించాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తవ డానికి దాదాపు నెల రోజుల సమయం పట్టవచ్చు. పూర్తిస్థాయిలో అనుమతులు లభించిన తర్వాత టెండర్ల ద్వారా పనులు చేపడతాం.

-డి.వెంకట్రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నీటిపారుదల శాఖ

జమ్మలమడుగు నియోజకవర్గంలో...

జమ్మలమడుగు మండలంలోని అలసందచెరువు, పెద్దచెరువు, కొర్లకుంట చెరువుతో పాటు పెద్దముడియం, మండలంలోని చిన్న చెరువు, నల్లచెరువు మరమ్మతుల జాబితాలో ఉన్నాయి.

● మైలవరం మండలానికి సంబంధించి వెంకటచెరువు, పల్లెచెరువు, తురకల చెరువు, దాడివానిచెరువు, ఊరకుంట చెరువు దాడివానికుంట, పాపోజికుంటలు మరమ్మతులు జబితాలోఉన్నాయి. ● ముద్దనూరు మండలంలో గంగాదేవిపల్లె చెరువు, ఓబులా పురం, మంగపట్నం, పెనికలపాడు, యామవరం, ఉప్పలూరు చెరువులు మరమ్మతులుకు నోచుకోనున్నాయి.

● ఎర్రగుంట్ల మండలంలో వలసపల్లె, తిప్పలూరు చెరువులకు మరమ్మతులు చేపట్టనున్నారు.

● కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి మండలంలో ఉన్న కుమ్మరిచెరువు, కోనాయపల్లె చెరువులకు మరమ్మతుల చేపట్టనున్నారు. వీరపునాయునిపల్లె మండలంలో కొండచెరువు, చెన్నూరు మండలంలోని రాచాయనాయపల్లె, కొండపేట చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి.

● మైదుకూరు నియోజకవర్గంలోని మైదుకూరు మండలంలో ఎర్రచెరువు, లింగాలదిన్నె, ఎల్లంపల్లె, ఉత్పలవరం, సోమయాజుల పల్లె చెరవుల్లో మరమ్మతులు చేయనున్నారు.

● బిమఠం మండలంలో మద్దెరు రిజర్వాయరు, ఎద్దులాయపల్లె, నేలటూరు, చిన్నరాయిని చెరువులను మరమ్మతుల చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

● చాపాడు మండలంలో మదూరు, పల్లవోలు, నాగులపల్లె చెరువులకు, ఖాజీపేట మండలంలో నల్లవాగుచెరువు, చెముళ్లపల్లె, దుంప లగట్టు, రావులపల్లె, పుల్లూరు చెరవుల్లో మరమ్మతు పనులు చేపట్టనున్నారు.

బద్వేలు నియోజకవర్గంలో

బద్వేలు మండలంలో కొత్తచెరువు, పుట్టాయపల్లె, గోపాలపురం , మర్రిమానుకుంట, కొంగలవీడు, బోయినపల్లె, తిప్పనపల్లె, తెలగాపురం, రామాపురం చెరవుల మరమ్మతుల జాబితాలో ఉన్నాయి. పోరుమామిళ్ల మండలంలోని రామిరెడ్డికుంట, టి.చల్లగిరిగెల, అక్కల్‌రెడ్డిపల్లె, బయటూరి, బసంపల్లె, కొత్తచెరువులు మరమ్మత్తుకు నోచుకోనున్నాయి. కలసపాడు మండలంలోని ముదిరెడ్డిపల్లె, రాచెరువులు, తడకువాగుచెరువు, కాశినాయన మండలంలో సిద్దయపల్లి చెరువు మరమ్మతుల జాబితాలో ఉన్నాయి.

● కడప నగరంలోని పాతకడప చెరువుతో పాటు బచ్చుంపల్లె చెరువులు మరమ్మతులు జాబితాలోఉన్నాయి.

● ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చెన్నంరాజుపల్లె, నాగాయపల్లె చెరువులు మరమ్మతుల జాబితాలో ఉన్నాయి.

భారీ స్కోర్ దిశగా చిత్తూరు, నెల్లూరు జట్లు



జెనిక్‌దాస్ (చిత్తూరు), సోహన్‌వర్మ (నెల్లూరు)

కడప స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్- 23 మెన్స్ మల్టీడే (మూడురోజుల) ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో మొదటిరోజైన శనివారం తమ తమ ప్రత్యర్థి జట్లపై చిత్తూరు, నెల్లూరు జట్లు భారీ స్కోర్ దిశగా సాగుతున్నాయి. వివరాలిలా....

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో..: చిత్తూరు- కడప జట్ల మధ్య కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో సాగుతున్న మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 346 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో జెనిక్‌దాస్ 109 పరుగులు, రెడ్డి రుషి 84 పరుగులు, తేజారెడ్డి 60 (నాటౌట్) పరుగులు సాధించి జట్టు భారీ స్కోర్‌కు దోహదపడ్డారు.

ఏసీఏ క్రికెట్ మైదానంలో: నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 82 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 374 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఇందులో సోహన్‌వర్మ 166 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. మరో బ్యాటర్ పవన్ రిత్విక్ 79 పరుగులు చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాకథాన్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ట్రిపుల్‌ఐటీ అధికారులు

వేంపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాష్ట్రస్థాయి క్వాంటమ్ కంప్యూటింగ్ హ్యాకథాన్ పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇంటర్నల్ హ్యాకథాన్ పోటీలు నిర్వహించగా 120 మంది విద్యార్థులు తమ సాంకేతికత పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. అందులో మొదటి ఐదు టీములు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ట్రిపుల్‌ఐటీ అధికారులు తెలిపారు. వచ్చే నెలలో అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విజేతలుగా నిలిచిన బృందాలకు డైరెక్టర్ కుమారస్వామిగుప్త చేతులమీదుగా నగదు బహుమతులను పంపిణీ చేశారు. యువత ప్రదర్శించే సాంకేతికతతో భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు భాస్కరయ్య, కార్తీక్, లైబ్రేరియన్ కోనప్ప, పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

గండిలో భారీగా భక్తులు


గండి క్షేత్రంలో అంజన్న దర్శనం కోసం వచ్చిన భక్తులు

చక్రాయపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానానికి శనివారం భారీగా భక్తులు తరలివచ్చారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు భక్తులు భారీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, మాజీచైర్మన్ కల్లూరు వెంకటస్వామి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. వివిధ రకాల టికెట్ల ద్వారా దాదాపు రూ.4లక్షలకు పైబడి ఆదాయం వచ్చింది.

వ్యక్తి అదృశ్యం... కేసు నమోదు

పులివెందుల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో వల్లెపు మోహన్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఆయన భార్య అరుణ పోలీసులను ఆశ్రయించింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే.... సత్య సాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఈదు లపల్లెకు చెందిన వల్లెపు మోహన్, అతని భార్య, కుమారుడు అత్తగారి ఊరైన పులి వెందులకు వినాయకచవితి పండుగకు వచ్చారు. శుక్రవారం తిరిగి ఆ గ్రామానికి వెళ్లేందుకు పులివెందులలో బస్సు ఎక్కా రు. అరుణ, ఆమె కుమారుడు బస్సు ఎక్కారు. కానీ మోహన్ మాత్రం బస్సు ఎక్కలేదు. కొంతదూరం వెళ్లిన అనంతరం బస్సులో మోహన్ లేడనే విషయాన్ని అత ని భార్య గుర్తించింది. వెంటనే అత్తమామలకు సమాచారం అందించి తిరిగి పులి వెందులకు వచ్చి వెతికినా ఆచూకీ తెలియ కపోవడంతో అరుణ ఫిర్యాదు పోలీసు లకు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సిద్దార్థ తెలిపారు.

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

● కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలి ● ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి మల్లిక

కడప మారుతీనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అఖిల భారత ఆశావర్కర్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి కె.మల్లిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి అధ్యక్షతన యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు శనివారం కడప మునిసిపల్ హైస్కూల్ సమీప వైయస్ఆర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్లిక హాజరై మాట్లాడారు. 17 సంవత్సరాలుగా గ్రామాలలో, పట్టణాలలో గర్భిణులకు, బాలిం తలకు, నవజాత శిశువులకు సేవలందిస్తూ పాలక ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అయినప్పటికీ పాలక ప్రభుత్వాలు వారిని ఏ మాత్రం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఆశా కార్యకర్తలు చేస్తున్న పనికి తగి న వేతనం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటనలు చేస్తుంది తప్ప ఉత్తర్వులు జారీ చేయడం లేదన్నారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్య క్షుడు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణం ఆశాలకు మెరుగైన వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటనలు చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు తక్షణమే వేతనాలు పెంచి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, మూడవ మహాసభ కార్యక్రమానికి ముందు భారీగా వచ్చిన ఆశా కార్యకర్తలు కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏఐటీయూసీ జెండాలు చేతపట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్, శాంతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఆశావర్కర్స్ యూనియన్ జాతీయ కార్యదర్శి మల్లిక

పెన్నానదిలో యువకుడు గల్లంతు

మైలవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన తిమ్మని వెంకటరమణ (30) గ్రామ సమీపంలోని పెన్నానదిలో శనివారం సాయంత్రం గల్లంతయ్యాడు. వెంకటరమణకు మతిస్థిమితం సరిగా ఉండదని, ఏదో కారణం చేత పెన్నానదిలో దిగి ఉంటారని గ్రామస్థులు చెబుతున్నారు. పెన్నానదిలో పడిన వెంటనే స్థానికులు మైలవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కాపాడేందుకు విశ్వప్రయత్నం చేశారు. కానీ పెన్నానదిలో నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో యువకుడి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి వచ్చే నీటిని నిలుపుదల చేశారు. యువకునికి తల్లిదండ్రులు లేరని స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మలమడుగు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన కె.చంద్రశేఖర్‌రెడ్డి (40) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా... ముద్దనూరు మండలం ఉప్పలూరుకు చెందిన కె.చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 24వ తేదీ ద్విచక్ర వాహనంలో జమ్మలమడుగు వైపు నుంచి బయల్దేరాడు. ముద్దనూరు రోడ్డులో ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. అదే రోజు చికిత్స కోసం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు... తర్వాత హైదరాబాదుకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి


మృత్యువాతపడ్డ గొర్రెలు, గొర్రెపిల్లల వద్ద వెంకటశివ

పులివెందుల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని అగడూరు గ్రామానికి చెందిన వెంకటశివ అనే వ్యక్తికి సంబంధించిన గొర్రెలపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 12 గొర్రెలు, గొర్రె పిల్లలు మృత్యు వాతపడ్డాయి. మరో 18 గొర్రెలు గాయపడినట్లు వెంక టశివ తెలిపారు. దాదాపు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు గొర్రెల కాపరి తెలిపారు.

మున్సిపల్ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్ల నియామకం

● ఆరు ప్రదేశాల్లో మోడరన్ బస్ షెల్టర్లు నిర్మాణం ● కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ తీర్మానం

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిపై నైట్ వాచ్‌మెన్ల నియామకానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. కడప కార్పొరేషన్ పరిధిలో ఆరు ప్రదేశాల్లో మోడరన్ బస్ షెల్టర్ల నిర్మాణానికి టెండర్ ప్రాతిపదికన ఇచ్చేందుకు తీర్మాణం చేశారు. శనివారం కార్పొరేషన్ మేయర్ చాంబర్‌లో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో 40 అంశాలను ప్రవేశపెట్టగా 40అంశాలకు కూడా స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ప్రధానంగా నగరంలో 11 పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించేందుకు అంగీకారం తెలిపారు. అలాగే మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 55 మంది పార్ట్ టైం టీచర్లను రెన్యువల్ చేస్తూ తీర్మాణం చేశారు. పాత బస్టాండ్‌లోని 15షాపు రూముల బాడుగను పెంచుతూ మరో మూడేళ్ల రెన్యువల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని 15షాపు రూముల లీజు కాలపరిమితి రెన్యువల్ చేశారు. పారిశుధ్య కార్మికులకు యూనిఫాం రూ.45లక్షలు, కొబ్బరి నూనె ఇతర వాటికి అయ్యే రూ.26లక్షల ఖర్చును జనరల్ ఫండ్ నుంచి భరించాలని తీర్మానించారు. నేక్‌నామ్ ఖాన్ కళాక్షేత్రం నిర్వహణ బాధ్యతలు నిర్వహించేందుకు ముగ్గురు ఉద్యోగుల సేవలను ఒక ఏడాది పొడిగించుటకు తీర్మానించారు. దేవుని కడపలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణను టీటీడీ వారికి అప్పగించాలని నిర్ణయించారు. నగరంలో ఆరు ప్రదేశాలలో మోడరన్ బస్‌షెల్టర్ల నిర్మాణానికి టెండర్ పద్ధతి ద్వారా ఏడేసీ యాడ్ ఏజెన్సీ వారికి అనుమతి మంజూరు చేయాలని తీర్మానించారు. సమావేశంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు మక్బుల్‌బాష, బాలస్వామిరెడ్డి, కె.బాబు, అరీఫుల్లా, ఎస్.వాణి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, ఈఈలు ధనలక్ష్మి, విజయ్‌కుమార్‌రడ్డి, ఆర్ఓ కన్నయ్య పాల్గొన్నారు.


స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్, కమిషనర్ తదితరులు

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభు త్వ, ప్రైవేట్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ బోర్డు (ఏపీపీఎంబీ) నోటిపికేషన్‌ను విడుదల చేసింది పారామెడికల్ ట్రైనింగ్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ఇంటర్మీడియట్ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేట్ పారా మెడికల్ శిక్షణా కేంద్రా లలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తి చేసిన దర ఖాస్తులను వచ్చే నెల సెప్టెంబరు 8వ తేదీ సాయంత్రం 5గంటల లోపు డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజే యాలన్నారు. మరిన్ని వివరాలకు ఏపీపీఏ హెచ్ఎ న్‌సీ. సీవో.ఇన్ వెబ్ సైట్‌లో చూడాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కానగూడూరు పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్

దువ్వూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరు గ్రామ పంచాయతీ సెక్రటరీ బాలస్వామిని సస్పెండ్ అయినట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు చెప్పారు. వీరబల్లి మండలంలోని సానిపాయ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసే సమయంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు రుజువు కావడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కానగూడూరు పంచాయతీ సెక్రటరీగా ఆయనను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

బ్యాక్‌వాటర్‌లో తాడిపత్రి గణపయ్యల నిమజ్జనం

కొండాపురం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన సుమారు 300 గణపయ్య విగ్రహాలను ఆదివారం గండికోట బ్యాక్‌వాటర్‌లో నిమజ్జనం చేయనున్నారు. మండలంలోని సుగుమంచిపల్లె సమీపంలో గండికోట వెనుకజలాల్లో నిమజ్జనం చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రి నుంచి ఇక్కడికి 15 కిలోమీటర్ల దూరం ఉంది. పెద్దఎత్తులో విగ్రహాలు నిమజ్జనానికి రానుండటంతో బందోబస్తు కోసం తాడిపత్రి పోలీసుల సహాయం కోరినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా కొండాపురం పట్టణంలోనూ, కొన్ని గ్రామాల్లోని గణపయ్యలకు ఆదివారం నిమజ్జనం నిర్వహించనున్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న ఏపీ

ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



కడప మారుతీనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి సర్కార్ ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం సమపాళ్ళతో ముందుకెళుతూ ప్రజల కిచ్చిన హామీలను అమలుచేస్తూ సుపరిపాలన దిశగా ముందుకు సాగుతున్నదని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. అయినప్పటికీ ప్రజలకందుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక వైసీపీ అధినాయకుడు జగన్‌రెడ్డి సినిమాలలో విలన్ లెక్కన స్వంత పత్రికలో కూటమి సర్కార్‌పై విషపు రాతలు రాయించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. జగన్‌రెడ్డి ఇదివరక టి పాలనలో సాగించిన దందాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, హత్యలు, దాడులు, ప్రజలు మరువలేదనే సంగతి గుర్తెరగాలన్నారు. ప్రజలు బాగా గుర్తుపెట్టుకునే ఇటీవల జిల్లాలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో క్రుతీసీ వాత పెట్టినట్లుగా వైసీపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రాకుండా చేశారన్నారు. ఆ మేరకు శనివారం కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ సర్వతోముఖాభివృద్ధి కోసంగా పెండింగ్‌లో వున్న అన్ని ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు కేంద్రం కట్టుబడి వుందన్నారు. నీటితోనే నిధులు, ఉపాధి, ఉద్యోగాలు, రవాణా సౌకర్యాలు అంతకంతకూ పెరుగుతుందనే నమ్మకంతో చంద్రబాబు ప్రాజెక్టులకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. జగన్‌రెడ్డి లాగా అప్పట్లో సినిమాలలో వలే సెట్టింగ్‌లు వేసి తాత్కాలిక నీటిని అందించలేదని అన్నారు. ఇప్పటికే జిల్లాలోని గండికోట, మైలవరం, సర్వరాయసాగర్, చిత్రావతి, పైడిపాళెం, బ్రహ్మంసాగర్, కే.సీ కెనాల్ ఆయకట్టుకు ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో నిండివున్నాయన్నారు. అలాగే జిల్లాలోని నేషనల్ హైవేకి మహర్దశ పట్టుకుందన్నారు. కడప-టూ రేణిగుంట, కడప టూ ముద్దనూరు, బద్వేల్ టూ నెల్లూరు, బద్వేల్ టూ మైదుకూరు, పోరుమామిళ్ళ టూ మైదుకూరు, తదితర ప్రాంతాలను కలిపేలా రోడ్లలో కొన్ని పనులు సాగుతున్నాయని మరికొన్ని రానున్నాయన్నారు.

అన్నదానం మహాపుణ్య కార్యం



అన్నదాన కార్యక్రమంలో సాయి మహేష్

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అన్నదానం మహాపుణ్యకార్యమని రాబిట్ సంస్థ సీఈఓ తుమ్మలూరు సాయిమహేష్ తెలిపారు. శనివారం కడప నగరం సంధ్యా సర్కిల్లో వినాయక చవితి పురస్కరించుకొని వినాయక విగ్రహం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా రామాంజనేయరెడ్డి, నయీమ్‌గౌస్

కడప మారుతీనగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాత్రికేయ రంగంలో పనిచేస్తున్న జేసీఎన్ రామాంజనేయరెడ్డి, మున్సిఫ్ టీవీ స్టాఫ్ రిపోర్టర్ సర్దార్ నయీమ్‌గౌస్ ఐజేయూ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయినట్లు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల జరిగిన ఐజేయూ ఎన్నికకు జిల్లా నుంచి రెండు నామినేషన్లు దాఖలు కావడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు. కాగా ఐజేయూలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం లభించడం పట్ల ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డితో పాటుగా జిల్లాలోని జర్నలిస్టులు అభినందనలు వ్యక్తం చేశారు.

సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

లింగాల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీటి సమస్య ఏర్పడకుండా శాశ్వత పరిష్కారం చూపామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంబకపల్లె గ్రామంలోని చెరువుకు లింగాల కుడికాల్వ నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు హిరోజుపురం ఎత్తిపోతల పథకం నుంచి పైప్‌లైన్ నిర్మాణానికి రూ.2.5కోట్లు ఎంపీ నిధులు మంజూరు చేయడం జరిగింది.పనులు పూర్తవడంతో అధికారులు చెరువుకు నీటిని విడుదల చేశారు. శనివారం అవినాష్‌రెడ్డి చెరువును పరిశీలించి మాట్లాడుతూ రైతులకు సాగునీటి కొరత రాకుండా సమస్యపరిష్కారం అయిందన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెరువు వద్ద జలహారతి ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో వైసీపీనాయకులుపాల్గొన్నారు.

అమృత సముద్రం భగవద్గీత



మాట్లాడుతున్న స్వామి తురియానంద సరస్వతి

కడప కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత అన్ని జ్ఞానాలకు మూలమని, తరగని ఆధ్యాత్మిక నిధియని, అనంతమైన అమృత సముద్రమని కడప చిన్మయమిషన్ అధ్యక్షుడు స్వామి తురియానంద సరస్వతి అన్నారు. శనివారం సాయంత్రం నగర పాత కడపలో దశమహావిద్వాన్ నాగేంద్ర మహోధర స్వామి ఆశీస్సులతో సనాతన ధర్మ సామూహిక ప్రార్థనా దేవాలయాల సంస్థ ప్రారంభించి మాట్లాడారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రామాయణ, భారత, భాగవతాలు నేటి సమాజానికి ఎంత ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మం సమాజ ప్రార్థనా దేవాలయ సంస్థ ఛైర్మన్ పసుపులేటి శంకర్, సంస్థ వ్యవస్థాపకుడు కాల్వ సోమ కళానాథరెడ్డి పలువురు ఆధ్యాత్మిక చింతనాపరులు, భక్తులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్టంలో ఉల్లి రైతులు కుదేలయ్యారని, కూటమి ప్రభుత్వం వారందరినీ ఆదుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉల్లి రైతులు వర్షాల వల్ల పంటలను ఎగుమతులు చేసుకోలేక నష్టాలపాలవుతున్నారన్నారు.

నిఘా నీడలో చెన్నూరు

పోలీసుల పహారాతో ప్రజల్లో ఉత్కంఠ ● మూడో రోజూ బందోబస్తు కొనసాగింపు





బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా గణేశుని ఊరేగింపులో చెన్నూరులో స్వల్ప ఘర్షణలు తలెత్తడంతో అది చినికి చినికి ఎక్కడ గాలివానగా మారుతుందోనని ముందు జాగ్రత్త చర్యగా కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు. గురువారం రాత్రి జరిగిన ఘర్షణ ఆనాటి వాతావరణం దృష్టిలో ఉంచుకుని ఇంకా గ్రామ పంచాయతీలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉండడంతో ఎక్కడ ఘర్షణలు తలెత్తుతాయో పరిస్థితి అదుపు ఎక్కడ తప్పుతుందోనన్న ఆలోచనతో ముందు జాగ్రత్తగా బందోబస్తు చేశారు. పలువురు సీఐలు, ఎస్‌ఐలు, ప్రత్యేక పోలీసు దళం చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో పోలీసుస్టేషన్ నుంచి కొండపేట రోడ్డు వరకు అలాగే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తూర్పు హరిజనవాడ ప్రాంతాల్లో పూర్తిగా అప్రమత్తమై బందోబస్తు చేస్తున్నారు. అలాగే ఎప్పటికప్పుడు అక్కడి నాయకులతో మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు కారణమైనా ఎవరినీ ఉపేక్షించేదిలేదని పదే పదే హెచ్చరించారు. ఉత్సవాలు అయిపోయేంత వరకు అయిపోయాక గొడవలకు దిగడం, పరిస్థితి మరోలా మలుచుకోవడం,గుంపులుగా ఉండడం చేయరాదని డీఎస్పీ హెచ్చరించారు. ఉత్సవాలు, పండుగలకు ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. గతంలో కూడా ఓ మారు ఇలాటి పరిస్థితి తలెత్తిందని మరలా రాకుండా చూసుకోవాలన్నారు.సీఐ క్రిష్ణారెడ్డి ఎప్పటికీ అందులో ఉంటారని, ఏ సమస్య అయినా నిర్భయంగా పోలీసుస్టేషన్‌లో చెప్పడంతో పాటు కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు క్రిష్ణారెడ్డి, రోషన్, సుబ్బారావు, పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

3న మండల మీట్

వేముల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేముల మండల సర్వసభ్యసమావేశం సెప్టెంబర్ 3వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 10గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

కొత్తూరు సుబ్బరాయుడుస్వామి విగ్రహావిష్కరణ



సీకేదిన్నె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం అప్పరాజుపల్లెలో కొత్తూరు సుబ్బరాయుడుస్వామి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. శ్రీకృష్ణచారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఆవుల అమర్‌నాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె మండలంలోని అప్పరాజుపల్లెలో కొత్తూరు సుబ్బరాయుడు స్వామి విగ్రహాన్ని వేద పండితుల సమక్షంలో ఆవిష్కరించారు.

సీఎం సహాయ నిధి భరోసా

పులివెందుల రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యంపట్ల ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా కల్పిస్తోందని మాజీ సర్పంచు ఉమాదేవి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 20 మంది బాధితులకు రూ.16,67,281 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చుమర్రి మహేష్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేట..: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట పెన్నిధిగా మారిందని మండల టీడీపీ అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చక్రాయపేట మండలానికి చెందిన 16మంది బాధితులకు మంజూరైన రూ.18లక్షల సీఎం సహాయనిధి చెక్కులను శనివారం అందించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరినీ సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరుగుతోందన్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత

వేంపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీలో మూడురోజుల పాటు జరిగే హృదయపూర్వక ధ్యాన కార్యక్రమాన్ని శనివారం ఎన్‌ఎస్‌ఎస్ 4వ యూనిట్, కెమికల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్త మాట్లాడుతూ ధ్యానం వల్ల ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ధ్యానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. డాక్టర్లు రాజశేఖర్, నాగవేణి ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోటేశ్వరి, సౌజన్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రాంతం నందీశ్వర ఆలయం

వేంపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలంలోని నందిపల్లె వద్దనూతనంగా వెలసిన నందీశ్వర ఆలయం ఆధ్యాత్మిక ప్రాంతంగా ఆహ్లాదకరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. నందిపల్లె గ్రామం వద్ద దాతలు, ప్రభుత్వ సహకారంతో నందీశ్వర ఆలయ ప్రాంగణాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఆలయ ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, శ్రీరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామగంగిరెడ్డి, రామలింగేశ్వర్ రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరియతల్లి అడుగుజాడల్లో నడవండి

కడప కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మరియమాత దేవునికి తల్లి మాత్రమే కాదని, సమస్త మానవాళి మొత్తానికి ఆమె తల్లి అని మాసాపేట విచారణ గురువులు ఫాదర్ జోసెఫ్‌రాజ్ పేర్కొన్నారు. ఆ తల్లి అడుగు జాడల్లో నడచినట్లయితే నేరుగా ఆ దేవుని సన్నిధికి చేరుకోవడానికి సులభమైన మార్గమని సూచించారు. ఆరోగ్యమాత తిరుణాల మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం నవదిన ప్రార్థనలలో భాగంగా నగర రైల్వేస్టేషన్ సమీప ఆరోగ్యమాత చర్చిలో మరియమాతను గుడిచుట్టూ ఊరేగించారు. ఆరోగ్యమాత చర్చి పెద్దలు, విశ్వాసులు, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లాలో రోడ్డు భద్రతపై అవగాహన

కడప క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అధికారులు జిల్లాలో వాహనదారులకు రోడ్డుభద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారులు వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డుభద్రతపై అవగాహన కల్పిం చారు. ఈసందర్భంగా మాట్లాడు తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే వాహనదా రులు తప్పనిసరిగా రహదారి భద్రత నియమాలను పాటించాలని సూచించారు. బైకు నడిపేవారన్నారు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.

లోకేశ్ పర్యటన ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలి



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్య రెడ్డి

పెండ్లిమర్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటన ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి అధికారులకు తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలో నూతనంగా నిర్మించిన డిగ్రీ కళాశాల భవనాలను శనివారం ఎమ్మెల్యే అధికారులతో కలసి పరిశీ లించారు.ఈ సందర్భంగా శిలాఫలకాల ఆవిష్కరణ ఏర్పాట్లు,తదితర వాటిపై అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జాన్ ఇర్విన్,మోప్మా పీడీ కిరణ్‌కుమార్,తహసీల్దార్ అనురాధ,టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

గరుడవాహనంపై దర్శనమిచ్చిన రంగనాథుడు



పులివెందుల రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):పులివెందుల పట్టణంలో శ్రీరంగనాథస్వామి నూలుపూజ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శ్రీరంగ నాథ స్వామి గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిఁచారు. అనంతరం స్వామివారు సతీస మేతంగా గరుడవాహనం పై దర్శనమివ్వగా భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కుకున్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం

పెండ్లిమర్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):దుకాణాదారులు ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డీసీటీవో గీతావాణి తెలిపారు.మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను శనివారం అధికారులతో కలసి తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకి మాత్రమే అమ్మాలని దకాణాదారులను ఆదేశించారు.అధిక ధరలకు విక్రయించినట్లు రుజువైతే లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఏడీ సురేష్, ఏఓ సుమంత్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు లాభం

కమలాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో రైతులకు అధిక లాభాలు ఉన్నాయని ఏవో సరస్వతి తెలిపారు. శనివారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో భూసార పరీక్షల ప్రాముఖ్యత,సేంద్రియ వ్యవసాయ పద్ధతులను గురించి రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయసిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఇందిరా, మంజుల, పావని, సందీప్, గిరిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జూనియర్ లెక్చరర్లకు డిగ్రీ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పిచాలని లెక్చరర్ల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం పులివెందుల ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిసి వారు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉపాధ్యాయ బదిలీలలో సర్‌ప్లస్‌గా ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ గణితం భాషా పండితులు ఉపాధ్యాయులకు క్లస్టర్ టీచర్లుగా నియమించబడిన వారికి డీఎస్సీ 2025 నియామ కాల కంటే ముందుగా ప్లేస్‌లను కేటాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష డిమాండ్ చేశారు. శనివారం డీఈవో షంషుద్దీన్‌ను ఎస్టీయూ జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు హబీబుల్లా, మహబూబ్‌బాష, కడప నగర అధ్యక్షుడు సాదిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళితే జీవితం నాశనం

కడప క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత సమాజమే లక్ష్యంగా డ్రగ్స్ వద్దు బ్రో.. అనే నినాదంతో నగరంలోని శంకరాపురం గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థులకు ఈగల్ సిబ్బంది శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాస్తవ పరిస్థితులను వివరించడం ద్వారా విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నార్కోటిక్ సెల్ నుంచి మల్లయ్య, ఈగల్‌టీం ఆయుబ్‌ఖాన్, గురుశేఖర్ పాల్గొన్నారు.

సీకేదిన్నె సీఐగా బాల మద్దిలేటి



సీకేదిన్నె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె నూతన సీఐగా బి.బాలమద్దిలేటి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రొద్దుటూరు సీఐగా పనిచేస్తూ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ నాగభూషణంను ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సత్వర న్యాయం అందిస్తామన్నారు.

ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పలు కేసుల్లో జైళ్లల్లో రిమాండు ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ,సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప బాబా ఫకృద్దీన్ తెలిపారు. శనివారం ఆయన కమలాపురం సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్‌రావుతో కలిసి విజిట్ చేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైను నెంబరు 15100కు ఫోను చేసి న్యాయసహాయం పొందవచ్చన్నారు.

మహిళలకు కొండంత అండ శక్తి యాప్

కడప క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలకు కొండంత అండ శక్తి యాప్ అని శక్తి టీం మహిళా ఎస్‌ఐ శాంతమ్మ అన్నారు. శక్తియాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి శనివారం కడప నగరంలోని సాయిబాబా హైస్కూలు, భాష్యం హైస్కూలులో విద్యార్థులకు శక్తి టీం మహిళా ఎస్‌ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

చెన్నూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగలోని నాలుగో రోజు చెన్నూరులో గణేశుని ఊరేగింపు ఘనంగా జరిగాయి. చెన్నూరు పోలయ్య గారివీధిలో రామాయణం అమర్, ఆకుల ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఇందులో నందికొట్కూరు నుంచి వచ్చిన బ్యాంకు వాయిద్య బృందం అందరినీ ఆకట్టుకుంది. మహిళలు సైతం ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే సరస్వతీనగర్, బ్యాంకువీధి తదితర ప్రాంతాల్లో గణేశ్ ఊరేగింపు జరిగాయి. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దారి పొడవునా ప్రజలకు ప్రసాదాలు పంచిపెట్టారు. పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

సింహాద్రిపురం..: సింహాద్రిపురంలో జెండామాను వీధిలోని జెండా లయన్స్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాట రూ. 80 వేలు పలికింది. శనివారం పోటాపోటీగా జరిగిన వేలం పాటలో సింహాద్రిపురానికి చెందిన కుమ్మెత మదన్ మోహన్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు లక్ష్మినరసింహారెడ్డి, కుమార్తె సుజిత గణేశ్ లడ్డూ వేలం పాట దక్కించుకున్నారు.

వేంపల్లె..: మండలంలో వినాయక విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగురోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి శనివారం ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను డప్పువాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం నందిపల్లె, ఇతరప్రాంతాల్లో స్వామివారి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.కాగా కరణాల వీధిలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం మండపంవద్ద శనివారం రాత్రి లడ్డూ వేలంపాట నిర్వహించారు. నామా శ్రీనివాసులు, శ్యామల దంపతులు రూ.40100 కు పాడి దక్కించుకున్నారు.

పులివెందుల రూరల్..: వినాయక చవితి పర్వదినం సందర్భంగా కొలువుదీరిన వినాయకుల ప్రతిమల నిమజ్జన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పులివెందుల సమీపంలోని చెరువులు, తొండూరు మండలం ఇనగలూరు వద్దనున్న రాజసేతు సాగర్ తదితర ప్రాంతాలలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.కాగా పట్టణంలోని పలు ప్రాంతాలలో వినాయక మండపాల వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాల్లో మాజీ సర్పంచు ఉమాదేవి హాజరయ్యారు.



సింహాద్రిపురంలో గణేశ్ లడ్డూ వేలం పాట దక్కించుకున్న మదన్‌మోహన్‌రెడ్డి



చెన్నూరులో గణేశుని ఊరేగింపు



వేంపల్లె కరణాల వీధిలో లడ్డూ వేలం దక్కించుకున్న నామా శ్రీనివాసులు



పులివెందులలో

ఆర్భాటమే తప్ప..ఆచరణ శూన్యం

- గత వైసీపీ హయాంలో లక్షలు నవ్వులపాలు
- పాడిపరిశ్రమ కోసమంటూ పాలవెల్లువ కేంద్రాలు
- అలంకార ప్రాయంగా నిలిచిన భవనాలు
- జాడలేని ఆర్థిక భరోసా


తాళ్లమాపురంలో అలంకారప్రాయంగా మారిన బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ప్రచార ఆర్భాటమే తప్ప.. ఆచరణ శూన్యమంటూ పలువురు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులను ఆదుకునేందుకు పాల ఉత్పత్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పాలవెల్లువ పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. అయితే పేరు బాగుంది కాని లక్ష్యమే నవ్వుల పాలవుతోంది. ప్రతి 2,500 పశువులకు ఒక క్లస్టర్‌గా విభజించి ప్రతి మండలానికి అయిదు నుంచి ఏడు క్లస్టర్లుగా లెక్కకట్టారు. పాడి రైతు మహిళా సాధికారతను బలోపేతం చేయడం కోసం జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం పేరున భవనాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. వాటిలో పాలశీతలీకరణ కోసం యంత్రాలు, పరికరాల కోసం చర్యలు చేపట్టారు. పాల వెల్లువ కేంద్రాల నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధుల కింద ఒక్కోదానికి రూ.15 లక్షలు కేటాయించారు. అయితే స్థలం, నిధుల కొరత, ముందుకు రాని కాంట్రాక్టర్లు తదితర కారణాలతో బాలరిష్టాలను దాటలేదు. ముచ్చటగా రెండు మూడు భవనాలు నిర్మించారు. వాటిలో కూడా కొన్ని చోట్ల భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. పూర్తయినవి అలంకారప్రాయంగా మారాయి. 1, 2 చోట్ల ప్రారంభించి మూత వేశారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌విడుదలకు ముందు పాలశీతలీకరణ పరికరాలు లేకుండానే భవనాలను ప్రారంభం చేపట్టి మమ అనిపించారు.

మాటలకే పరిమితం

లక్షల ఖర్చుతో నిర్మించిన ఈ కేంద్రాల వలన ఇసుమంత ప్రయోజనం లేకపోవడంతో గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రాథమిక సదుపాయాలు లేకపోవడంతో మూతపడిన పాల వెల్లువ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రొద్దుటూరు మండల పరిధిలో 15 చోట్ల పాల వెల్లువ కేంద్రాలకు అప్పట్లో ఆమోదం లభించింది. అందులో కేవలం నంగనూరుపల్లి, తాళ్లమాపురంలో నిర్మాణాలు చేపట్టారు. రాజుపాళెం మండలంలో, అర్కటవేములలో నిధుల కొరతతో నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. దువ్వూరు మండలం చిన్న సింగనపల్లి కట్టడం పూర్తికాగా గుడిపాడులో అసంపూర్తిగా నిలిచింది. యంత్రాలు, పరికరాల ఊసులేదు. వాటిని ఏమి చేయాలో, ఈ పథకాన్ని సద్వినియోగం ఎలా చేసుకోవాలో అధికారులకే అర్థమవ్వని అయోమయమైన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం దీనిపై నిర్దిష్టమైన కార్యాచరణ చేపట్టి వేలాది పాడి కుటుంబాలకు పాల అమ్మకాల్లో గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని పాడిరైతులు కోరుతున్నారు.

పశుసంవర్ధక శాఖ ఏడీ ఏమన్నారంటే..

ఈ పాల వెల్లువ కేంద్రాల నిర్వహణపై ప్రస్తుత ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి నిర్దిష్ట ఆదేశాలు లేవని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఆర్.ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. పాడిపరిశ్రమ, పాలవెల్లువ కేంద్రాల ఏర్పాటుపై ఏడీని 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా పై విధంగా స్పందించారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో లక్ష్మీనరసింహుడు

బద్వేలు రూరల్. ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం వేకువజామునే అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లు ప్రత్యేక పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

రేపు గణేశ్ నిమజ్జన శోభాయాత్ర

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో సెప్టెంబరు 1వ తేదీన గణేశ్ నిమజ్జన శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నగర గణేశ్ ఉత్సవ కేంద్ర సమితి అధ్యక్షుడు టి.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు యాదాల రమేష్‌లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2గంటలకు సామూహిక నిమజ్జన శోభాయాత్ర రామేశ్వరం నుంచి ప్రారంభమై కామనూరులోని కుందూ నది వరకు నిర్వహించి కుందూలో వినాయకుని నిమజ్జనం నిర్వహిస్తామన్నారు. శోభాయాత్ర సందర్భంగా కోలాటం, చెక్కభజన, కర్రసాము వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శోభాయాత్ర అనంతరం కామనూరులోని ఎడిపై పాఠశాల వద్ద అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు, ప్రజలు శోభాయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ కలశ పునఃప్రతిష్ఠ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 6వ తేదీ కలశ పునఃప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈవో ఎ.శ్రీధర్‌లు తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నెల రోజుల క్రితం ఆలయ ప్రధాన రాజగోపురంపై ఉన్న కలశాన్ని కోతులు కిందపడవేశాయని దీంతో కలశానికి రెండు బాగాలు కిందపడ్డాయని పేర్కొన్నారు. దీంతో ఈ కలశాన్ని సెప్టెంబరు 6వ తేదీ హోమాలు నిర్వహించి సంప్రోక్షణ చేసి పునఃప్రతిష్ఠ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

రాజుపాలెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొరపాడు, వెలవలి, రాజుపాలెం, టంగుటూరు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శనివారం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఇందులో మైదుకూరు ఏడీఏ ఎం.క్రిష్ణమూర్తి, విజిలెన్స్ ఏఈ శివన్న మండల వ్యవసాయాధికారులు దుకాణాలను పరిశీలించి యూరియాతోపాటు అన్ని రకాల ఎరువులను ఎమ్మార్పీకే అమ్మాలని సూచించారు. రైతులకు బిల్లులు అందించాలని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన కృష్ణమూర్తి



మైదుకూరు రూరల్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన కళ్యాణ్‌ను శనివారం మైదుకూరు సీనియర్ జనసేన నాయకుడు చిలుంగారి కృష్ణమూర్తి కలిశారు. విశాఖపట్టణంలో జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కృష్ణమూర్తి పాల్గొన్నారు. మైదుకూరులోని జనసేన పార్టీ స్థితి గతుల గురించి ఆయనతో చర్చించినట్లు కృష్ణమూర్తి తెలిపారు.

చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి

మైలవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి అన్నారు. శనివారం మండల పరిధిలోని నార్జాంపల్లె, మైలవరంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆమె పర్యటించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్‌జడ్జి మాట్లాడుతూ పిల్లల రక్షణ కొరకు 1098 టోల్‌ఫ్రీ నంబరు పిల్లల కోసం 24 గంటలు పనిచేస్తుందన్నారు. బాల్య వివాహాలు, శారీరక, మానసిక వేధింపులు, ఇంటి నుంచి తప్పిపోయినప్పుడు ఏ సమస్యలు ఉన్నా పిల్లలు ఈ నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాది సుబ్బారావు, మైలవరం ఎస్‌ఐ శ్యాంసుదర్‌రెడ్డి, హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడు బసివి రమేష్ మృతి



బద్వేలుటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జనసేన నియోజక ఇన్‌చార్జి బసివి రమేష్ శనివారం మృతి చెందారు. ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాదులో చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. పలువురు కూటమి నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు. జనసేన పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని పలువురు నాయకులు పేర్కొన్నారు.

ప్రిన్సిపాల్ నిరంజన్ సేవలు అద్వితీయం


ప్రిన్సిపాల్‌నుసన్మానించి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

బి.కోడూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ వర ప్రసాద్ విద్యార్థులకు అందించిన సేవలు అద్వితీయమని వక్తలు పేర్కొన్నారు. శనివారం ఆయన పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన 35 సంవత్సరాల సుదీర్ఘంగా క్రమశిక్షణతో విద్యార్థులకు సేవలందించారన్నా రు. అనంతరం పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాల్ నిరం జన్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ఉద్యోగులకు సహజమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాల, శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ చిన్నయ్య, సీనియర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగ ఒడికి చేరిన గణనాథులు


గణపతి బప్పా మోరియా అంటూ గణేశ్ ఊరేగింపులో సందడి

ప్రొద్దుటూరు/ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులు శనివారం గంగమ్మ ఒడి చేరారు. ప్రొద్దుటూరులో గణేశ్ నిమజ్జనా కార్యక్రమాలు ఉత్సవ విగ్రహ కమిటీలు భారీ ఎత్తున చేపట్టాయి. శనివారం పట్టణంలోని అనేక ప్రాంతాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనం పాల్గొన్నారు. అనేక మండపాల వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు నృత్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. శనివారం మిట్టమడివీధిలోని 8వ నంబరు వీధిలో యువతరంగం వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి నిమజ్జనం సందర్భంగా కోలాటం, చెక్కభజన వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

పెద్దముడియంలో రక్తదాన శిబిరం

పెద్దముడియం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామానికి చెందిన యువకులు వినాయకచవితి సందర్భంగా శనివారం గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదానశిబిరాన్ని రూరల్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ సుబ్బారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఇలాంటి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం వినూత్న ఆలోచనన్నారు. సుద్దపల్లెకు చెందిన యూత్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం సహకారంతో ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని గ్రామానికి చెందిన యువకులు శేషు, బాలు తదితర యువకులను సీఐ అభినందించారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని నంద్యాల బ్లడ్ సెంటరు నిర్వాహకులకు అందించారు.

నిమజ్జనానికి తరలివెళ్లిన గణపయ్యలు


నిమజ్జనానికి వెళుతున్న గణపయ్యలు

జమ్మలమడుగు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శనివారం వినాయక విగ్రహాలు నిమజ్జనం కోసం ట్రాక్టర్లలో తరలివెళ్లారు. జమ్మలమడుగు, మోరగుడి, గూడెం చెరువు తదితర ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వినాయక విగ్రహాలను భక్తులు తరలించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వెంట రంగులు చల్లుకుంటూ చిందులు వేస్తూ మేళాల మధ్య తరలివెళ్లారు.


వినాయకుని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

మైలవరంలో: మండల పరిధిలోని వేపరాల, దొమ్మర నంద్యాల, మైలవరం, తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో శనివారం నిమజ్జనం చేశారు. రంగులు చల్లుకుంటూ పురవీధుల్లో చిందులేస్తూ చిన్నారులు, పెద్దలు ఆనందోత్సాహాల మధ్య ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనం చేశారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఎర్రగుంట్లలో ముగ్గులపోటీలు



ఎర్రగుంట్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రెడ్డినగర్-మహేశ్వరనగర్2 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద మహిళకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. ఏరువాకగంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి భక్తులు మహానీరాజం పలికారు. సాయంత్రం ఉట్టికొట్టి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లడ్డూవేలం ఓ భక్తుడు రూ.1.10లక్షలు పాడారు. అలాగే స్వామివారికి వేసిన నోట్ల దండను రూ.32వేలకు పాడి భక్తిని చాటుకున్నారు. ఎర్రగుంట్లలోని చాలా చోట్ల ఏర్పాటు చేసిన వినాయకున్ని నిమజ్జనానికి తీసుకెళ్లారు.

కొండాపురంలో: మండలంలోని రేగడిపల్లెలో ఆదివారం నిమజ్జనం సందర్భంగా వేలంపాటలో లడ్డూను రేగడిపల్లె యూత్ అసోషియేషన్ రూ.40,500 లకు దక్కించుకున్నారు. సీఎంఆర్‌కాలనీ, గండ్లూరు శివాలయం తదితరచోట్ల ఉన్న వినాయకుని మండపాలవద్ద శనివావరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అలాగే గండ్లూరులో శివాలయం వద్ద ఉన్న వినాయకుని మండపంలో శనివారం రాత్రి లడ్డూ వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన కిశోర్ అనే వ్యక్తి రూ.30,000లకు దక్కించుకున్నాడు. కాగా మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకుడు శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


నిమజ్జనానికి తరలివెళుతున్న గణపయ్యలు

ముద్దనూరులో: వినాయక చవితి పండుగ సందర్భంగా కొలువు దీరిన గణపయ్యలు శనివారం నిమజ్జనానికి బయలుదేరి వెళ్లారు. నాలుగు రోజుల పాటు వినాయకుని మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఊరేగింపుగా రంగులు చల్లుకుంటూ, బ్యాండువాయిద్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు.

పోరుమామిళ్లలో : మండలంలో పోరుమామిళ్లలో ఏర్పాటు చేసిన గణనాదుల విగ్రహాల వద్ద ఆయా కమిటీ సభ్యులు, ప్రజలు భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే రెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన గణనాధుని విగ్రహంవద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. కగా అమ్మవారిశాలవీధి, మూలవీధి, అంబాబావివీధి, రామాయణపు వీధి, కొత్తవీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద పూజలు, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివారం విగ్రహాలన్నీ నిమజ్జనానికి తరలివెళుతున్నాయి.

మహిళా అభ్యున్నతే సీఎం చంద్రబాబు ధ్యేయం


స్త్రీశక్తి సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, బడుగు, బలహీన వర్గాలతోపాటు మహిళా అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్త్రీశక్తి సూపర్‌హిట్ సమావేశంలో భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికోసం, మహిళల కోసం ఇచ్చిన మాట సీఎం నిలబెట్టుకున్నారన్నారు.సూపర్-6 పథకాలు సూపర్ హిట్ అయ్యాయన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధిలేక ప్రజలు ఆ పార్టీకి తిరుగుబాటు చేసి కూటమిని ఎంచుకున్నారన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో సోలార్ ప్రాజెక్టు, గండికోట టూరిజం, స్టీల్‌ప్లాంటు తదితరవన్నీ అభివృద్ధిలో భాగమేనన్నారు. అనంతరం మండలస్థాయిలోని మహిళా నాయకులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి టీడీపీ ఇన్‌ఛార్జి భూపేశ్‌రెడ్డి,ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలోని కూటమి నాయకులు, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సాగిన కౌన్సిల్ సమావేశం


మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ఎర్రగుంట్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మున్సిపల్ సమావేశం శనివారం మొక్కుబడిగా సాగింది. ఉదయం 11.30 గంటలకు అత్యవస మున్సిపల్ సమావేశం చైర్మన్ ఎం.హర్షవర్దన్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభం కాగానే 17వ వార్డు కౌన్సిలర్ ఎరికలరెడ్డి మాట్లాడుతూ ఎర్రగుంట్ల అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం నుంచి దుమ్ము భారీగా వస్తోందని ఇటీవల జాయింట్ కలెక్టర్‌కు కూడా వినతిపత్రాన్ని ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈకాలుష్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈవిషయంపై కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ ఈ అంశం తన పరిధిలో లేదని అయినా కాలుష్య మండలి అధికారులకు తెలిపి పరిష్కంచేందుకు కృషి చేస్తామన్నారు. తాత్కాలిక కార్మికులను, ఎవరికి తెలియకుండా నియమించుకునే విషయం పై కో ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించగా గతంలో కౌన్సిల్ ఆమోదం మేరకు కార్మికులను నియమించుకుంటున్నట్లు కమిషనర్ సమాధానమిచ్చారు. అజెండా చదవకుండానే సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జైబున్నీసా, చంద్రకళ, కౌన్సిలర్లు పెన్నారషీద్, శివప్రసాద్, ఎరుకలరెడ్డి, కల్లూరు సునీత, రామాంజనేయులు, హేమలత, కో ఆప్షన్ సభ్యుడు రఫి, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించొద్దు

ఎర్రగుంట్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలుగా పనిచేసే వారు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించరాదని రోగులకు యాంటిబయాటిక్స్ ఇంజక్షన్లు, టాబ్లెట్స్ ఇచ్చే అర్హత లేదని అర్బన్ ఆసుపత్రి వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆయన ఎర్రగుంట్లలోని ఆర్‌ఎంపీ వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ డీఎంహెచ్‌ఓ ఆదేశానుసారం తాము ఆర్‌ఎంపీ వైద్యశాలలను తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే క్లీనిక్స్‌ని సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ పై చైర్‌పర్సన్ ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు , ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కౌన్సిల్ మీటింగ్ పెట్టడానికి సహకరించడం లేదని వైసీపీ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి వైస్ చౌర్మన్లు బంగారు రెడ్డి ఖాజాలు ఆరోపించడం సరికాదని టీడీపీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, మహ్మద్ గౌస్ మునీర్, కమాల్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మున్సిపాలిటీలో అనుభవం లేని అధికారులను కమిషనర్లుగా తెచ్చుకొని మీరు ఎక్కడ సంతకాలు పెట్టమంటేఅక్కడ సంతాకాలు పెట్టి కోట్ల రూపా యలు ఆర్జించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఎగ్జిబిషనుకు కూరగాయల మార్కె ట్‌కు అత్యధిక పాటజరిగి మున్సిపాలిటీకి ఆదాయం సమకూరిందన్నారు. మున్సిపా లిటీలో కోట్ల రూపాయల నిధులున్నా వైసీపీకి మెజారిటీ ఉందని అడ్డంపెట్టుకొని ప్రొద్దు టూరు ప్రజలకు అభివృద్ధి జరగకుండా అడ్డుకుంటోంది మీరుకాదాఅని ప్రశ్నిం చారు. ఇప్పటికైనా అభివృద్ధికి సహక రించి మున్సిపల్ సమావేశాలు జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జులు పోసా భాస్కర్, సురేష్, నూరీ, రామాంజ నేయులరెడ్డి, రఘునాథరెడ్డి బాబు పాల్గొన్నారు.

జమ్మలమడుగు సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ


రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి బాబాఫక్రుద్దీన్

జమ్మలమడుగు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సబ్‌జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గౌరవ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. ముందుగా ఆయన సబ్‌జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ల ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు ఆవరణలో రిమాండ్ ఖైదీలు, వారి హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్‌ఎయిడ్ డెఫెన్స్ కౌన్సిల్ సిస్టంను వివరించారు. ఖైదీలతో మాట్లాడి ఆరోగ్య విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైళ్లలో బాల నేరస్థులు ఉంటే గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం జరుగుతోందన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబరు 15100కు సమస్యలుంటే మండల న్యాయ సమితికి తెలియజేయాలన్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ కమలాపురం, ప్రొద్దుటూరు, తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేసి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల ప్రాధాన్యతను తెలియజేసినట్లు జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, జైలు సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు, లీగల్ వలంటీర్లు, రిమాండ్ ఖైదీలు పాల్గొన్నారు.

కక్షిదారులతో మాట్లాడి కేసుల రాజీకి కృషి చేయండి


ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి సత్యకుమారి

ప్రొద్దుటూరు , ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులతో మాట్లాడి కేసుల రాజీకి కృషి చేయాలని ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో జిల్లా రెండవ అదనపు జడ్జి సత్యకుమారి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా కోర్టులో ఇన్సూరెన్సు కంపెనీ మేనేజర్లు న్యాయవాదులతో కేసుల రాజీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సత్యకుమారి మాట్లాడుతూ సెప్టెంబరు 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయ్యేలా కక్షిదారులతో మాట్లాడా లన్నారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్సూ రెన్సు కంపెనీ మేనేజర్లు లాయర్లు పాల్గొన్నారు.

ఉచిత న్యాయసేవలను వినియోగించుకోండి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ

గోపవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉచిత న్యాయసేవలను వినియోగించుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి పద్మశ్రీ పేర్కొన్నారు. గోపవరం మండలంలోని రాచాయిపేట హైస్కూలులో మండల పోలీసుశాఖ వారి సహకారంతో శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ న్యాయ సలహాల కోసం 15100కు ఫోను చేసి వివరాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు సంబంధించిన వారిని తక్కువ చూపు చూడకుండా సమాజంలో సమానంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణ, సెక్రటరీ మురళీ, శివకుమార్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.